# ఒకనాటి రాత్రి

శ్రీ పంతుల నరశింగరావు.



యవ్వనంలో క్రిందా మీదా తెలియదు. యవ్వనం అంత గ్రుడ్డిది. ఆ వెన్నెల రాత్రులలో మా క్షుద్ర కుటీరాని కెదురుగా వుండే పచ్చికమీద కూర్చుని మేఘాలతో దాగుడుమూత లాడుకొనే చంద్రుణ్ణి చూచి మేమూ దాగుడుమూత లాడుకొనేవాళ్ళం. అలాటి సమయాల్లో కోటలోని దీపమును చూస్తే నాకు మహా చెడ్డభయము వేస్తూయుండేది. అది నా వైపు కోపంగా చూస్తున్నట్టు కనబడేది. అలా చాలకాలం దినాలు వెళ్ళబుచ్చేం మేమిద్దరమూను.

కలకాలం ఒక్కతీరుగా నడుస్తే యింకేం గావాలి? రాజులకు, అందులో ఎంత శాంతమూర్తులయిన చక్రవర్తులకు కూడ కొద్దో గొప్పో రాజ్యకాంక్ష వుండడం సహజం. అందులోనూ చక్రవర్తులు దుర్మార్గులైతే యిక చెప్పేదేముంది? శాంతమూర్తులయిన రాజులు ఏదో ఒక పెద్ద కారణం వుంటేగాని, అన్యాయంగా యుద్ధానికి దిగరు. రెండో తరగతివారి కవి అక్కరలేదు. తన దేశము పైకి తనకంటె బలవంతుడొకడు వచ్చిన తనగతి ఏమగునో ఆలోచించడు. తానాజ్ఞ యిచ్చుచున్నాడు సైనికులమైన మేమందరమూ చేయవలసినదే? వెళ్ళననినమా, వెళ్ళిననూ చావు తథ్యము. సైనికుల తలితండ్రులు ఎంత తమ కుమారుల కొరకై విలపింతురో వారికేమియు తెలియదు. ప్రతి మానవునకు చావు తప్పదనియు దేశము కొరకు ప్రతి మానవుడు తన ప్రాణముల దారబోయ వలయుననియు వేదికపై నిల్చి గంభీరోపన్యాస మొసగినాడే గాని తన ప్రాణములయందాశ వదలుకొని కదనరంగమున కాలు పెట్టినాడా? కాదు, తన ప్రాణమన్న తనకంత ఆస! తన ప్రియురాలి ముద్దులు గొనుటకింకనూ తా బ్రతికి యుండవలె. ఆ మంచుకురియు ప్రదేశములో వేనకువేలు మేము ఒక్కని ఆశకొరకు ప్రాణము లర్పింప వలసినదే?

తప్పనిపని. మాతల్లి ఎంతయో నేర్చినది. ఏమి ప్రయోజనము. సైనికుడను. అందులోను చిన్న దళమున కధిపతిని. గర్భవతియగు ప్రియురాలి ముద్దులు గొని కన్నీరు గార్చుచుండ కన్నతల్లి కంట దడిపెట్టి దీవనలిచ్చి పంపక దన భూమికి పయనమై కదలిపోతిని.

ఎన్నియో వత్సరములట్లు యుద్ధము కొనసాగెను సైనికులలో చాలమంది మరణించిరి. ఆ మంచుకురియు ప్రదేశములలో రాత్రిపూట శవములకు నిప్పంటించుచుండెడి వారము చలిబాధ తీరుటకు.

సాయంతన మవజొచ్చెను. యుద్ధము చాలింపుడని రణగంట మ్రోగెను. సైనికుల మందరము ఏదో కొంత భుజించి పీచు పరుపులపై మాటాడుకొనుచు నిద్రబోతిమి.

అలా పయనమై పోతున్నా నే నొక్కడనే మాతృభూమికి. సెలయేళ్ళ ధ్వనులు వింటూ అక్కడక్కడ విశ్రమిస్తూ మాతృభూమిని గురించి పోతున్నా.

చెట్లన్నీ అప్పుడే చిగిరిస్తున్నాయి. ఆ లోయలలో నుండి ప్రకృతి దృశ్యాలు చూస్తూ అలా పోతున్నా. కొంత కాలానికి మాతృ భూమికి చేరుకున్నా. పట్టణమంతా నిశ్శబ్దమయి పోయింది. ఎన్నాళ్ళకో తిరిగివచ్చిన నన్ను చూచినా ప్రియురాలు పోలిక పట్టలేక పోయింది కొంతసేపటివరకు ఎన్నాళ్ళకో గలిగిన ఆ కౌగలింత— ప్రియురాలిని కౌగలించుకుంటూ ముద్దిడబోతున్నా—

గణగణ గంట—హృదయాలన్నీ తల్లడిల్లేగంట- యుద్ధపుగంట—

కొంతసేపటివరకూ నమ్మలేక పోయినా యిది యుద్ధభూమియని.